నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, బుధవారం 9 ఏప్రిల్ 2025 | KARIMNAGAR

## విజయవంతం చేయాలి

**మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్**



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 8 : ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. మానకొండూర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించిందని, ఆ లక్ష్యాన్ని సాధించామని గుర్తు చేశారు. పార్టీ ఏర్పాటై 25 ఏండ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించే మహాసభకు మానకొండూర్ నియోజక వర్గం నుంచి దాదాపు 12 వేల నుంచి 20 వేల మంది వరకు తరలి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఉదయం 10 గంటలకు గ్రామాల్లో గులాబీ జెండా ఎగురవేసి బయలుదేరుతారని, కొందరు ఒక్క రోజు ముందుగానే ట్రాక్టర్లు, కాలినడకన ద్వారా కూడా వస్తారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని, అన్ని అనుమతులతో కచ్చితంగా సభను విజయవంతం చేస్తామని తెలిపారు. సమావేశంలో రాజన్న సిరిసిల్ల జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, మాజీ జడ్పీటీసీలు తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శంకరపట్నం మండలాధ్యక్షుడు గంట మహిపాల్, మాజీ సర్పంచులు రామంచ గోపాల్‌రెడ్డి, దేవ సతీశ్‌రెడ్డి, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి శాతరాజు యాదగిరి, నాయకులు పల్లె నర్సింహారెడ్డి, గూడూరి సురేశ్, సతీశ్, ఇస్కుల్ల అంజనేయులు, పిండి సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు సిరిసిల్లకు కేటీఆర్



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ బుధవారం సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు సిరిసిల్ల జిల్లాకేంద్రానికి చేరుకుంటారు. ముందుగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హనుమాన్ దీక్షా స్వాములకు ఏర్పాటు చేస్తున్న బిక్ష కార్యక్రమానికి హాజరవుతారు. మధ్యాహ్నం 1.30 గంటలకు గంభీరావుపేటలో పెద్దమ్మ తల్లి ఆలయాన్ని సందర్శిస్తారు. సాయంత్రం 5గంటలకు కోనరావుపేట మండలం మల్కపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొననున్నారు.





సన్నాహక సమావేశానికి తరలివచ్చిన శ్రేణులనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, వేదికపై మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, పార్టీ నగరాధ్యక్షుడు చల్లా హరిశంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు పొన్నం అనిల్, ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు

# రజతోత్సవ సభ సక్సెస్ చేద్దాం

- ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి
- కరీంనగర్ నియోజకవర్గం నుంచి 10 వేల మందిని తరలించాలి
- కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోంది
- ప్రజలు మరోసారి కేసీఆర్ పాలన కోరుకుంటున్నరు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- కరీంనగర్‌లో పార్టీ ముఖ్యనేతలతో సన్నాహక సమావేశం

కరీంనగర్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జన సమీకరణపై మంగళవారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అధ్యక్షత వహించి దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ముఖ్యభూమిక పోషించినట్లే పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు మరోసారి సైనికుల్లా పనిచేయాలని కోరారు. పార్టీ స్థాపించి 25 ఏండ్లు గడుస్తున్న నేపథ్యంలో వరంగల్‌లో నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు కరీంనగర్ నియోజకవర్గం నుంచి 10 వేలకుపైగా జనాన్ని తరలించాలని, సభను సక్సెస్ చేసి, బీఆర్ఎస్ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ అంటే కేసీఆర్‌కు ప్రత్యేకమైన అభిమానం ఉందని, ఉద్యమ సమయంలో 2001లో పార్టీని స్థాపించిన తర్వాత సింహగర్జన పేరుతో నగరంలోనే భారీ బహిరంగ సభను నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమం చివరి దశలో 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో' నినాదంతో ఇక్కడి నుంచే బయలుదేరి వెళ్తుండగా అల్గునూర్‌లో అరెస్టయిన విషయాన్ని ప్రస్తావించారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత కూడా రైతుబంధు, దళిత బంధు వంటి అనేక ముఖ్య పథకాలను ఇక్కడి నుంచే కేసీఆర్ ప్రారంభించారన్నారు. బీఆర్ఎస్ పార్టీని కేసీఆర్ స్థాపించి, ప్రజలను కదిలించి ఉద్యమం చేయకుంటే తెలంగాణ వచ్చేది కాదన్నారు. 1969 మాదిరిగానే ఉద్యమం కనుమరుగయ్యేదని, ఛత్తీస్‌గఢ్ మాదిరిగా తెలంగాణ కూడా వెనుకబడి కరెంట్, నీళ్లు, నిధుల కోసం అష్ట కష్టాలు పడాల్సి వచ్చేదని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడక ముందు కరీంనగర్ ఎట్లుండేదని? ఇప్పుడెలా అభివృద్ధి చెందిందో గమనించాలని సూచించారు. రాష్ట్రం ఏర్పడి మన నిధులు, నీళ్లు, మనకు రావడమే అందుకు కారణమని, తెలంగాణ రావడానికి మూల కారణం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అని ఉద్ఘాటించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చెప్పిన అబద్ధాలను నమ్మి ప్రజలు అధికారం ఇచ్చారని, కానీ వచ్చిన అవకాశాన్ని ఆ పార్టీ నాయకులు సద్వినియోగం చేసుకోక ఆగమాగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న పార్టీకి అడ్డంకులు సృష్టించవద్దని కేసీఆర్ కూడా తమకు చెప్పారన్నారు. కానీ, ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న నాయకుడు అధికార గర్వంతో 'పేగులు తీసి మెడలో వేసుకుంటా.. లాగులో తొండలు జొప్పిస్తా.. కాళ్ల కిందేసి తొక్కుతా'నని వ్యాఖ్యానిస్తున్నారని, ఆయన కేసీఆర్‌పై చేస్తున్న వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు కూడా వ్యతిరేకిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను కంటికి రెప్పలా కాపాడిందని, అధికారం కోల్పోయినా ప్రజల వెంటనే ఉంటోందని, తమకు ఓట్లు వేయలేదని ప్రజలను ఏనాడు పట్టించుకోకుండా ఉండలేదన్నారు. కేసీఆర్, బీఆర్ఎస్ ఒక్కటే ఈ రాష్ట్ర ప్రజలకు రక్షణగా ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, పార్టీ నగర శాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కరీంనగర్ మండల శాఖ అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్ గౌడ్, కొత్తపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్ర రాజు, మాజీ ఎంపీపీలు తిప్పర్తి లక్ష్మయ్య, పిల్లి శ్రీలత మహేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు, పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రెడ్డవేని మధు, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ జమీలొద్దీన్, మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యులు సాబీర్ బాషా, దుర్శేడు సింగిల్ విండో చైర్మన్ తోట తిరుపతి, వైస్ చైర్మన్ నర్సయ్య,పార్టీ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, మైనార్టీ సెల్ నగర శాఖ అధ్యక్షుడు మీర్ షౌకత్ అలీ, ప్రధాన కార్యదర్శి నవాజ్ హుసేన్, యువజన విభాగం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గంగాధర చందు పాల్గొన్నారు.

> బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి. ఒక్క కరీంనగర్ నియోజకవర్గం నుంచే 10 వేల మందిని తరలించాలి. సభను కనీవినీ ఎరుగని రీతిల్లో సక్సెస్ చేద్దాం. మరోసారి మన సత్తాచాటుదాం.
>
> **- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్**

> రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన కుంటుపడిపోయింది. పూర్తిగా గాడి తప్పింది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ప్రజలకు చేసిందేమీలేదు. పాలనపై ప్రజలు అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నరు. కాంగ్రెస్ చెప్పిన అబద్ధాలను నమ్మి తాము మోస పోయామని భావిస్తున్నరు. ప్రభుత్వంపై రోజురోజుకూ ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నది. ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నరు.
>
> **- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్**




తిప్పన్నపేటలో చలో వరంగల్ వాల్ రైటింగ్‌ను ప్రారంభిస్తున్న జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత

## చలో వరంగల్

- రజతోత్సవ సభకు విస్తృత ప్రచారం
- జగిత్యాల, కోరుట్లలో వాల్ రైటింగ్‌లు

జగిత్యాల/జగిత్యాల రూరల్/ ఏప్రిల్ 8: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ నేపథ్యంలో పార్టీ నాయకులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తరలిరావాలని, విజయవంతం చేయాలని పల్లె, పట్టణం అనే తేడా లేకుండా సభలు, సమావేశాలు నిర్వహిస్తూ శ్రేణులకు పిలుపునిస్తున్నారు. కాగా, మంగవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల యూసుఫ్‌నగర్‌లో గోడలపై స్వయంగా వాల్ రైటింగ్ చేసి వినూత్న ప్రచారం చేపట్టారు. అలాగే జగిత్యాల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అర్బన్ మండలం తిప్పనపేటలో వాల్ రైటింగ్ రాయించారు. బీఆర్ఎస్ సభకు వచ్చేందుకు ప్రజలు ఉత్సాహం చూపుతున్నారని చెప్పారు.




యూసుఫ్‌నగర్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలని వాల్‌రైటింగ్ చేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

## కదిలిరావాలి

**కోరుట్ల ఎమ్మెల్యే వాల్‌రైటింగ్స్**

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 8 : వరంగల్ జిల్లాలో ఈ నెల 27 నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో కదిలిరావాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పిలుపునిచ్చారు. మంగళవారం యూసుఫ్‌నగర్ గ్రామంలో గోడలపై స్వయంగా వాల్ రైటింగ్ చేసి వినూత్న ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలించిదని ప్రశంసించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పార్టీ నాయకులు వనరులను దోచుకుంటూ తెలంగాణ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని ఆగమాగం చేశారని ధ్వజమెత్తారు. రజతోత్సవ మహాసభలో అధినేత కేసీఆర్ భవిష్యత్‌పై దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. నియోజకవర్గం నుంచి 10వేల మందితో సభకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, పట్టణ, మైనార్టీ అధ్యక్షుడు ఎండీ ఫహీం, నాయకులు ఎనుగందుల సత్యనారాయణగౌడ్, పిడుగు సందయ్య, అన్వర్, పొట్ట సురేందర్, తుక్కారెడ్డి, బర్ల సుదీర్, బాబురావు, అచ్చ చంద్రశేకర్, రఘు, కల్యాణ్, నరేశ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# కేడీసీసీబీ దేశానికే ఆదర్శం

- లాభాల బాటలో కరీంనగర్ సహకార బ్యాంకు
- ఈ యేడాదిలో లక్ష్యాలు మరింతగా పెంచుకున్నాం
- సింగిల్ విండోలకు ధాన్యం సేకరించే అవకాశం ఇవ్వాలి
- సహకార వ్యవస్థను రాజకీయ కోణంలో చూడొద్దు
- కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



మాట్లాడుతున్న కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు


కరీంనగర్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ సహకార బ్యాంకు దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని, వరుసగా ఎనిమిది సార్లు జాతీయ స్థాయి అవార్డులు సాధించి సహకార వ్యవస్థకు దిక్సూచిగా మారిందని నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్, కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు స్పష్టం చేశారు. కరీంనగర్‌లోని బ్యాంక్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సహకార బ్యాంకు సాధించిన ప్రగతిని వివరిస్తూ మంచి లాభాలను ఆర్జించిందని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ₹6,500 కోట్ల నుంచి ₹7,300 కోట్లకు తమ వ్యాపారాన్ని పెంచుకొని 12.40 శాతం వృద్ధిని సాధించామని, ₹800 కోట్ల వ్యాపారం పెరిగిందని వివరించారు. డిపాజిట్లు ₹2,530 కోట్ల నుంచి ₹2,850 కోట్ల డిపాజిట్లు సేకరించి 12.60 శాతం వృద్ధిని సాధించామన్నారు. ₹3,972 కోట్ల నుంచి ₹4,458 కోట్లకు రుణాలు పెంచి 12.20 శాతం వృద్ధిని సాధించామని చెప్పారు. షేర్ క్యాపిటల్ ₹188.68 కోట్ల నుంచి ₹216.12 కోట్లకు పెరిగిందన్నారు. ఇక రుణాల విషయాన్ని వివరిస్తూ ₹1,515 కోట్ల పంట రుణాలు, ₹288 కోట్ల దీర్ఘ కాలిక రుణాలు, ₹152 కోట్ల గృహ రుణాలు, ₹61 కోట్ల విద్యా రుణాలు, ₹223 కోట్ల మహిళా స్వశక్తి రుణాలు ఇచ్చామని, 98 శాతం రికవరి సాధించామని, స్థూల ఎన్‌పీఏ శాతం 0.73 నుంచి 0.54 శాతానికి తగ్గిందని చెప్పారు. 18 బ్యాంకు శాఖలు వంద శాతం రికవరీ చేశాయని, మరో 4 శాఖలు 98 శాతం రికవరీ చేశాయని, స్థూల లాభం ₹100 కోట్ల నుంచి ₹119 కోట్లకు పెరిగిందని, బ్యాంకు పరిధిలో 131 సంఘాలు ఉండగా 128 సంఘాలు లాభాల్లో ఉన్నాయన్నారు. సహకార సంఘాల పరిధిలో 60 వేల నుంచి 70 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాములను సమకూర్చుకున్నామని తెలిపారు. బ్యాంకులో యూపీఐ మొబైల్ యాప్, ఐఎంపీఎస్, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ వంటి డిజిటల్ సేవలు కూడా అందిస్తున్నామని చెప్పారు. కమర్షియల్ బ్యాంకులతో సమానంగా పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, బీమా వంటి సదుపాయాలు సమకూర్చుతున్నామని, అన్ని శాఖల్లో సేఫ్ లాకర్ల సదుపాయం ఉన్నదని వివరించారు.

### ఆర్థిక సంవత్సర లక్ష్యాలు

ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం లక్ష్యాలను మరింతగా పెంచుకున్నామని రవీందర్‌రావు వివరించారు. ₹3,600 కోట్ల డిపాజిట్లు సేకరించాలని, ₹5,400 కోట్ల రుణాలు అందించాలని, ₹9 వేల కోట్ల వ్యాపారం పెంచుకోవాలని పాలకవర్గం నిర్ణయించిందని, అలాగే ₹600 కోట్ల పంట రుణాలు, ₹350 కోట్ల దీర్ఘకాలిక రుణాలు, ₹300 కోట్ల మహిళా స్వశక్తి రుణాలు, ₹175 కోట్ల గృహ రుణాలు, ₹75 కోట్ల విద్యా రుణాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. 5 ప్రాథమిక సహకార సంఘాల పరిధిలో ₹2.90 కోట్లతో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. అందుకోసం కోసం నాలుగెకరాల ప్రభుత్వ భూమిని కేటాయించిన పెద్దపల్లి కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే విధంగా ప్రోత్సహించాలని మిగతా జిల్లాల కలెక్టర్లకు విజ్ఞప్తి చేశారు.

### ధాన్యం సేకరించే అవకాశం ఇవ్వాలి

వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసే అవకాశాన్ని ఇవ్వాలని రవీందర్‌రావు కోరారు. కొన్ని జిల్లాల్లో ప్రత్యేకించి సిరిసిల్లలో ధాన్యం సేకరించే బాధ్యతల నుంచి సహకార సంఘాలను తప్పిస్తున్నారని, మిగతా జిల్లాల్లోనూ అక్కడక్కడా ఇలాంటి చర్యలే జరుగుతున్నాయని, ఇది సరైన నిర్ణయం కాదన్నారు. సహకార వ్యవస్థను ఎట్టి పరిస్థితుల్లో రాజకీయకోణం చూడరాదని విజ్ఞప్తి చేశారు. గత పద్నాలుగేండ్ల నుంచి సహకార సంఘాలు ధాన్యం సేకరిస్తున్నాయని, అప్పుడు మంత్రిగా ఉన్న శ్రీధర్‌బాబు ఈ ప్రతిపాదన చేశారని, అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ విధానాన్ని ప్రోత్సహించిన విషయాన్ని గుర్తు చేశారు. కరీంనగర్ కేంద్ర సహకార బ్యాంక్ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, దేశ విదేశాల నుంచి వచ్చి మన సహకార వ్యవస్థను స్టడీ చేసి వెళ్తున్నారని, అక్కడ మన విధానాలను అమలు చేస్తూ అభివృద్ధిని సాధిస్తున్నారని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం అందిస్తే మరింత ముందుకు వెళ్లే అవకాశాలు ఉంటాయని అన్నారు. సమావేశంలో బ్యాంకు ఉపాధ్యక్షుడు పింగలి రమేశ్, డైరెక్టర్లు సీఈవో సత్యనారాయణ రావు, డైరెక్టర్లు ఉచ్చిడి మోహన్ రెడ్డి, సింగిరెడ్డి స్వామిరెడ్డి, శ్రీగిరి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



# ఇసుక రీచ్ వద్దే వద్దు

- భూగర్భ జలాలు పడిపోతున్నయి
- చెక్‌డ్యాం నిర్మాణంతో భూములు కోతకు గురవుతున్నయి
- సాగు భూముల చుట్టూ సైడ్ వాల్ నిర్మించాల్సిందే
- లేదంటే బ్యాక్‌వాటర్‌తో 60 ఎకరాలు నష్టపోతం
- మూలవాగులో ఇసుకరీచ్‌ను అడ్డుకున్న రైతులు
- కలెక్టర్ స్పందించాలని వేడుకోలు

కోనరావుపేట, ఏప్రిల్ 8: కోనరావుపేట మండలం వెంకట్రావుపేట, బావుసాయిపేట మధ్య మూలవాగులో ప్రభుత్వం చెక్ డ్యాం నిర్మిస్తున్నది. చెక్ డ్యాం వద్ద ఉన్న ఇసుకను, సమీపంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ నుంచి కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు, మర్రిపల్లి ప్రాజెక్టుకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో చెక్ డ్యాం వద్ద బ్యాక్ వాటర్ నిలిచి మూలవాగును ఆనుకొని ఉన్న సుమారు 70 మంది చిన్నసన్నకారు రైతులకు సంబంధించిన 60 ఎకరాల భూమి కోతకు గురవుతుందని ఆందోళన చెందుతున్నారు. భూమి కోతకు గురికాకుండా సైడ్ వాల్స్‌ను రాతితో కట్టాలని, లేదంటే ఇసుక రీచ్ నిలిపివేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మూలవాగులో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను రైతులు అడ్డుకున్నారు. ఉదయాన్నే పెద్దసంఖ్యలో అక్కడకు చేరుకొని, ఇసుక తోడుతున్న ఎక్స్‌కవేటర్, టిప్పర్లను నిలిపివేసి నిరసన తెలిపారు. ఇసుక తీయడం వల్ల భూములు ఎక్కువ శాతం కోతకు గురవుతాయని, భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోతాయని వాపోయారు. ఇప్పటికే ఈ ఏడాది బోరుబావులు ఎత్తిపోవడంతో పొలాలు పూర్తిగా ఎండిపోయాయని ఆవేదన చెందారు. ఇసుక రీచ్‌ను ఇక్కడి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సాగు భూముల చుట్టూ సైడ్ వాల్ నిర్మించకుండా చెక్‌డ్యాం కోసం ఇసుక తీస్తే ఊరుకోనేది లేదని హెచ్చరించారు. అయినా బావుసాయిపేట రీచ్ నుంచి కలికోట సూరమ్మ చెరువు, మర్రిపల్లి, తదితర ప్రాంతాలకు ఇసుకను తరలించడమేంటని ప్రశ్నించారు. కొందరు రాత్రింబవళ్లు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని మండిపడ్డారు. వారిపై అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోకుండా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన చెందారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోకుండా చూడాలని కోరుతున్నారు. అడ్డుకున్న విషయం తెలిసిన వెంటనే తహసీల్దార్ వరలక్ష్మి, ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి, పోలీసులు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకున్నారు. రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. నష్టం జరగకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసువెళ్లి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



బావుసాయిపేట మూలవాగులో ఇసుక రీచ్‌ను అడ్డుకుంటున్న రైతులు

### మా ఆవేదన పట్టించుకునేవారే లేరు

మాకు మూలవాగును ఆనుకొని ఎకరంన్నర పొలం ఉంది. వాగు నుంచి బోరు ఉంది. రెండు నెలల నుంచి ఇసుక తీస్తుండడంతో బోరులో నీళ్లు అడుగంటినయి. నీళ్లు లేక పంట ఎండిపోతంది. అధికారులు ఇక్కడి నుంచి ఇసుకను తీసుకుకోపోవడమే తప్ప రైతుల ఆవేదన పట్టించుంటలేరు. వాగును ఆనుకొని చుట్టూ రాతితో సైడ్‌వాల్స్ కట్టకుండా మట్టి పోస్తున్నరు. ఇప్పటికే ఇసుక తీయడంతో భూమి కోతకు గురైంది. కలెక్టర్ స్పందించి రైతులకు నష్టం జరగకుండా చూడాలి.

**-పుల్లూరి లత, మహిళా రైతు, (బావుసాయిపేట)**

### పొలాలు ఎండుతున్నయి

మూలవాగులో ఇసుక రీచ్ ఏర్పాటు చేయడంతో బోర్ల చుక్క నీరు లేక పొలాలు ఎండిపోతున్నయి. భూగర్భ జలాలు అడుగంటి పోయి చివరి దశలో చాలా నష్టపోతున్నం. పెట్టుబడి మీద పడెటట్టున్నది. అధికారులు ఇసుక రీచ్‌ను తొలగించాలి. చెక్ డ్యాం దగ్గర ఉన్న భూములు కోత పడకుండా రాతితో కట్టలు కట్టాలి. మట్టిపోసి ఉంచితే మూలవాగులో వరద ఎక్కువ వచ్చినప్పుడు భూములు కోసుకపోతయ్. అధికారులు చొరవ చూపి నష్టం కలుగకుండా పనులు చేయాలి.

**- గెంటె లక్ష్మి, మహిళా రైతు, (బావుసాయిపేట)**